
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
శుక్రవారం, 30, మే, 2025



సోమశిలలో 43.042 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో గురువారం 43.042 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 3,030, ఉత్తర, దక్షిణ కాలువలకు 300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.97,950
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,895
మూడు శాతం జీఎస్టీతో	రూ.9,162
సవర (8 గ్రాములు)	రూ.73,296

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
36.5 /29.5

జిల్లాలో శుక్రవారం ఆకాశం పాక్షిక్షంగా మేఘావృతంగా ఉండి అక్కడక్కడ చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది. గురువారం గాలిలో తేమ 55 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

ఆర్‌ఐఈలో కొత్త కోర్సులు

నెల్లూరు (టౌన్): నగరంలోని వీఆర్ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన ఎన్సీఈఆర్టీ ప్రాంతీయ విద్యా సంస్థ (రీజినల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్)లో ఈ విద్యా సంవత్సరం నుంచి కొత్త కోర్సులను ప్రవేశపెట్టనున్నామని కోఆర్డినేటర్ రమేష్‌బాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండేళ్ల బీఈడీ, ఎంఈడీ, మూడేళ్ల సమీకృత బీఎడ్, ఎమ్మెడ్, నాలుగేళ్ల సమీకృత బీఏ - బీఎడ్, బీఎస్సీ - బీఎడ్, ఆరేళ్ల సమీకృత ఎమ్మెస్సీ ఎడ్, రెండేళ్ల ఎంఏ (ఎడ్యుకేషన్) తదితర కోర్సుల్లో ప్రవేశాలుంటాయని చెప్పారు. దీనికి సంబంధించిన ప్రవేశ పరీక్షను వచ్చే నెల 29న ఆన్‌లైన్లో నిర్వహించనున్నారని వెల్లడించారు. ఆసక్తి గల వారు ఎన్సీఈఆర్టీ ఆర్‌ఐఈ వెబ్‌సైట్‌లో వచ్చే నెల 17లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నేపథ్యంలో నామమాత్రపు ఖర్చుతో పాటు ఉపకార వేతనాలూ లభించనున్నాయని తెలిపారు.

పడవల రాకపోకలపై విచారణ



జువ్వలదిన్నె హార్బర్‌లో వివరాలు సేకరిస్తున్న మెరైన్, మత్స్యశాఖ అధికారులు

బిట్రగుంట: బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లోకి అనుమతి లేకుండా పడవలు ప్రవేశించడంపై మెరైన్ పోలీసులు, మత్స్యశాఖ అధికారులు గురువారం విచారణ నిర్వహించారు. వేట నిషేధం అమల్లో ఉండగా బుధవారం ఆరు పడవలు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌లోకి రావడం, వీటిలో ఐదు పడవలు వెళ్లిపోవడంతో స్థానిక మత్స్యకారులు మెరైన్, మత్స్యశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఇస్కపల్లి మెరైన్ ఎస్సై జానకిరామిరెడ్డి, కావలి మత్స్యశాఖ ఏడీ శ్రీనివాసులు జువ్వలదిన్నె చేరుకుని విచారణ చేపట్టారు. ఇక్కడే ఉన్న ఆరో పడవలోని వ్యక్తులను విచారించగా, వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో జువ్వలదిన్నె హార్బర్‌లో పడవలు నిలుపుకున్నామని, వాతావరణం అనుకూలించిన వెంటనే ఐదు పడవలు వెళ్లిపోయాయని తెలిపారు. తమ పడవలోని ఇద్దరు కనిపించకపోవడంతో వారి కోసం ఎదురుచూస్తూ ఉన్నామని వివరించారు. వేట నిషేధం అమల్లో ఉన్న సమయంలో ఆరు పడవలు రావడం, నిబంధనలకు విరుద్ధంగా ఫిషింగ్ హార్బర్ వద్ద లంగరు వేయడంపై జరిమానా విధించి వివరాలు ఆరా తీస్తున్నారు.

తూకాల్లో తేడాపై రైతుల ఆందోళన



కందుకూరు: పొగాకు బేళ్ల తూకాల్లో తేడాలొస్తున్నాయంటూ కనిగిరి రోడ్డులోని ఒకటో పొగాకు వేలం కేంద్రంలో రైతులు ఆందోళనకు గురువారం దిగారు. 150 కిలోల చొప్పున బేళ్లను ఇంటి వద్ద కట్టుకొని వేలానికి రైతులు తీసుకొస్తారు. అయితే కేంద్రానికి తీసుకొచ్చాక కాటా వేస్తే తేడా వస్తోందని, ఒక బేలుకు రెండు కిలోల వరకు తగ్గుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలా ఎందుకు జరుగుతోందని అధికారులను నిలదీశారు. గతంలోనూ ఇలాంటి ఘటన చోటుచేసుకుందని, దీంతో ఒక బేలు పొగాకుకు రూ.500 వరకు నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో రైతుల అనుమానాలను నివృత్తి చేసేందుకు అధికారులు యత్నించారు. ఎలక్ట్రానిక్ కాటాలో తేడాల్లేకుండా చూస్తామని, తప్పులను సరిచేస్తామని నచ్చజెప్పారు.

కూటమి అక్రమాలకు భయపడొద్దు



పూజితతో మాట్లాడుతున్న అనిల్‌కుమార్‌యాదవ్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వ అక్రమాలకు భయపడాల్సిన అవసరం లేదని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పీఏసీ సభ్యుడు అనిల్‌కుమార్‌యాదవ్ పేర్కొన్నారు. డైకస్‌రోడ్డులోని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నివాసంలో ఆయన కుమార్తె పూజితను గురువారం కలిసి ధైర్యం చెప్పారు. మంత్రిగా, ప్రజానాయకుడిగా కాకాణి అందించిన సేవలు వృథా కావన్నారు. కార్యకర్తలు, నేతలు అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. కాకాణిపై పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. ఆఫ్కాఫ్ మాజీ చైర్మన్ కొండూరు అనిల్, మండల వెంకటశేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికీ కూటమి కష్టాలు

వైఎస్సార్‌సీపీ పాలనలో గడప వద్దకే సేవలు, పథకాలు

ఇంటి వద్దకే వైద్యం



నెల్లూరు రూరల్ మండలం నరసింహకొండలో ఓ వృద్ధుడికి ఇంటి వద్దనే వైద్యం చేస్తున్న డాక్టర్ రవీంద్రరెడ్డి(ఫైల్)

2022 నవంబర్‌లో ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ట్రయల్ రన్ జరుగుతున్న సమయం. నెల్లూరు రూరల్ మండలం సౌత్ మోపూరు పీహెచ్‌సీలో పని చేస్తున్న డాక్టర్ రవీంద్రరెడ్డి వైద్యశాలకు 8 కిలోమీటర్ల దూరంలో ఉన్న నరసింహకొండ గ్రామానికి తన వైద్యసిబ్బందితో కలిసి వెళ్లి మంచంలో ఉన్న వృద్ధుడికి బీపీ చెక్ చేసి షుగర్‌కు రక్తపరీక్ష చేసి మందులు ఇచ్చారు.

- అదే రోజు మధ్యాహ్నం దేవరపాళెంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న చిన్నారుల ఆరోగ్యాన్ని పరిశీలించి వారికి వ్యక్తిగత శుభ్రత, పరిశుభ్రత, చేతుల శుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఇదంతా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ వల్లనే సాధ్యమయింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌కు తూట్లు పొడిచింది. దీంతో ఇళ్లవద్దకే డాక్టర్ వచ్చి వైద్య సేవలందించడం ఆగిపోయింది.

గడప ముంగిటే రేషన్



జిల్లాలో 7.20 లక్షలకు పైగా రేషన్ కార్డుదారులు ఉన్నారు. ప్రతినెలా 12,500 మెట్రిక్ టన్నుల బియ్యం, ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే ఆ వాహనాలకు మంగళం పాడేశారు. జూన్ 1వ తేదీ నుంచి చౌకదుకాణాల ద్వారా రేషన్ పంపిణీకి ఉత్తర్వులు జారీ చేశారు. రేషన్ కోసం చౌకదుకాణాల వద్ద పనులు వదులుకుని క్యూలైన్లో గంటల తరబడి నిలబడి రేషన్ తీసుకోవాల్సిన పాత పరిస్థితులు వస్తున్నాయంటూ కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

- వింజమూరులోని జీబీకేఆర్ ఎస్టీ కాలనీలో 450 కుటుంబాలు ఉన్నాయి. టీడీపీ ప్రభుత్వంలో వింజమూరులోని వైశ్య బజార్‌లో ఉన్న డీలర్ వద్దకు వెళ్లి అనేక ఇబ్బందులు పడి సరుకులు తెచ్చుకునేవారు. వైఎస్ జగన్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇంటి వద్దకు రేషన్ బండి వచ్చి సరుకులు ఇచ్చేవారు. మంచి చేస్తాడు అని ఓట్లు వేస్తే నిండా ముంచారు అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మమ్మల్ని మోసం చేశారు



చంద్రబాబు ఎన్నికలకు ముందు వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తానని, రూ.10 వేలు జీతం అందజేస్తానని హామీ ఇచ్చి ఉన్న ఉద్యోగాలనే ఊడగొట్టారు. చంద్రబాబు మమ్మల్ని దారుణంగా మోసం చేశారు. మేము ఉన్నప్పుడు ఇంటి వద్దకే అన్ని సేవలు అందించేవాళ్లం. ఇంటి వద్దకే పింఛన్ ఇస్తున్నామంటూ చెబుతూ ఎక్కడో ఒక చోట కూర్చొని పింఛన్ నగదు ఇచ్చి పోతున్నారు.

– షేక్ మహ్మద్ రఫీ, మాజీ వలంటీర్

వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోంది



కూటమి అధికారంలోకి వచ్చి అద్భుతంగా పనిచేస్తున్న వలంటీర్ల వ్యవస్థను, ఇంటి వద్దనే సేవలు అందిస్తున్న ఎండీయూ వాహనాలను రద్దు చేశారు. ప్రతి వ్యవస్థను నిర్వీర్యం చేస్తుంది. సీనియర్ అని చెప్పుకునే చంద్రబాబు పాలన అందించడంలో పూర్తిగా వైఫల్యం చెందారు.

– హుమయూన్ బాషా, వలంటీర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు

నాడు



ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు ఇచ్చిన వలంటీర్లు. ఇంటికే సర్టిఫికెట్లు తెచ్చించిన సచివాలయ ఉద్యోగులు. గడప దాటకుండానే సంక్షేమ పథకాలకు దరఖాస్తులు తీసుకుని అందించిన సచివాలయ వ్యవస్థ. ఇంట్లోనే అందించిన వైద్య పరీక్షలు, సేవలు అందించిన ఫ్యామిలీ డాక్టర్లు. గడప ముందుకు వచ్చి రేషన్ సరుకులు ఇచ్చిన ఎండీయూ సిబ్బంది. ఊర్లోనే పాడి పశువులకు వైద్య సేవలు అందించిన వెటర్నరీ డాక్టర్లు. క్రిటికల్ వైద్యం చేయాలంటే తీసుకెళ్లేందుకు లిఫ్ట్ సౌకర్యం ఉండే వెటర్నరీ అంబులెన్స్‌లు.. ఇవన్నీ.. గత ప్రభుత్వ పాలనకు గీటురాళ్లు.

నేడు



రచ్చబండ వద్దకు చేరిన పింఛన్ల పథకం. సర్టిఫికెట్ కావాలంటే సచివాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగక తప్పని తిప్పలు. సంక్షేమ పథకాల ఊసే లేదు. ఎప్పుడొస్తాయో చెప్పే నాథుడే లేడు. ఫ్యామిలీ డాక్టర్లు పీహెచ్‌సీలు దాటడం లేదు. నిన్నటి వరకు ఇంటి ముంగిటకు వచ్చిన రేషన్ ఇచ్చిన బండ్లు రేపటి నుంచి ఆగిపోనుండడంతో మళ్లీ రేషన్ దుకాణాల ముందు బారులు తీరాల్సిన పరిస్థితులు తప్పడం లేదు. పశువులకు అనారోగ్యం వస్తే పశువుల పాక దాక వచ్చి వైద్యం అందించే పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇంటింటికి కష్టాలు తప్పడం లేదు.

- వలంటీర్, ఫ్యామిలీ డాక్టర్, ఎండీయూ వ్యవస్థ రద్దు
- రచ్చబండ వద్దకు చేరిన 'ఇంటి వద్దకే పింఛన్'
- అనారోగ్యం వస్తే ఆస్పత్రులకు తప్పని పరుగులు
- రేషన్ సరుకులకు దుకాణాల ముందు బారులు



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు గుంటకాని కొండమ్మ. అనారోగ్యం వస్తే దూరంగా ఉండే వైద్యశాలకు వెళ్లి సేవలు పొందడానికి అనేక ఇబ్బందులు పడేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆమె కష్టాలకు ఉపశమనం కలిగింది. డాక్టర్లు, వైద్య ఆరోగ్య సిబ్బంది ఆమె ఇంటి వద్దకు వచ్చి అవసరమైన పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇచ్చేవారు. పైసా ఖర్చు లేకుండా వైద్యసేవలు అందేవి. ఇప్పుడు తన పరిస్థితి మొదటికి వచ్చిందని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

వైఎస్సార్‌సీపీ పాలనలో అందించే ప్రతి సేవతో పాటు కొత్త సేవలు తెస్తామన్న కూటమి ప్రభుత్వం కష్టాలు తెచ్చి పెట్టింది. గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే వచ్చి సేవలు అందించిన వ్యవస్థలకు స్వస్తి పలికింది. గత ఐదేళ్ల ముందు వరకు పౌర సేవలు పొందాలంటే అష్టకష్టాలు పడడంతోపాటు లంచాలు ఇచ్చుకునే పరిస్థితి ఉండేది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ప్రజలు గడిచిన ఐదేళ్లు రూపాయి లంచం లేకుండా, ఒక్క పూట కష్టపడకుండానే ఇంటి నుంచి పౌర సేవలు పొందారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరిగి పాత కష్టాలు మొదలయ్యాయి. ఇంటి వద్దకే సేవలు దేవుడెరుగు.. కార్యాలయాల చుట్టూ తిరిగినా పనులు కావడం లేదు.

– సాక్షి ప్రతినిధి, నెల్లూరు



ఫ్యామిలీ డాక్టర్‌ను నిర్వీర్యం చేశారు



ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ఇప్పుడు నిర్వీర్యం చేశారు. నడవలేని వారి కోసం డాక్టర్లు ఇళ్ల వద్దకు రావడం లేదు. దీంతో అష్ట కష్టాలు పడి ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తుంది. డబ్బులు ఎక్కువగా ఖర్చు అవుతున్నాయి. గతంలో మాదిరిగానే నడవలేని వారి కోసం, వృద్ధుల కోసం డాక్టర్లు ఇళ్ల వద్దకు వచ్చి వైద్య సేవలందించేలా చర్యలు చేపట్టాలి.

– మస్తానమ్మ, నల్లపరెడ్డిపల్లి, ఆత్మకూరు మండలం

ఫ్యామిలీ డాక్టర్‌ను పునరుద్ధరించాలి



ఈ వృద్ధ దంపతుల పేర్లు గునపాటి చంద్రారెడ్డి, శేషమ్మ. వీరు మనుబోలులో నివాసం ఉంటారు. ఇద్దరూ ఏడు పదుల వయస్సు దాటిన వారే. షుగర్, బీపీ వ్యాధులతో బాధపడుతున్నారు. వీరింటికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఒకటిన్నర కి.మీ దూరంలో ఉంటుంది. అవసాన దశలో ఉన్న వీరు పీహెచ్‌సీకు వెళ్లి బీపీ, షుగర్ టెస్టులు చేయించుకోలేరు. గత ప్రభుత్వంలో ఫ్యామిలీ డాక్టర్ వారింటికే వెళ్లి వైద్యం అందించేవారు. తాము ఈ వయస్సులో పీహెచ్‌సీకు వెళ్లలేమని ఇంటికి డాక్టర్లు వస్తే బాగుంటుందంటున్నారు. గతంలో ఇంటికి వైద్యులు వచ్చి పరామర్శించి పరీక్షలు చేసే వారని, ఇపుడా పరిస్థితులు లేవంటున్నారు.



ఆగిపోయిన సంచార పశు సేవా వాహనాలు

ఫ్యామిలీ డాక్టర్ సేవలకు బ్రేక్



నెల్లూరు (అర్బన్): నడవలేని వృద్ధులను, అనారోగ్యానికి గురై మంచానికే పరిమితమైన, ఇతర ఇబ్బందులు పడుతున్న గర్భిణులకు, అంగన్‌వాడీ, స్కూలు పిల్లలకు ఇంటి వద్దనే నాణ్యమైన వైద్యం అందించేందుకు ఆరోగ్య వ్యవస్థనే ప్రక్షాళన చేశారు. ఇందు కోసం 2022 నవంబర్‌లో ట్రయిల్ రన్‌గా ఫ్యామిలీ కాన్సెప్ట్ విధానాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తెచ్చింది. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు డాక్టర్లతో కలిపి 14 మంది సిబ్బందిని ఏర్పాటు చేశారు. ప్రతి 5 వేల మంది జనాభాకు ఒక స్పెషలిస్టు డాక్టర్ అనే నినాదంతో ఆ నాటి ప్రభుత్వం ముందుకు సాగింది. 2023 జనవరి నుంచి పూర్తి స్థాయిలో ప్రారంభించింది. వారిని ఇళ్ల వద్దనే పరీక్షించేవారు. బీపీ, షుగర్, ఈసీజీ వంటి కొన్ని పరీక్షలను ఇంటి వద్దనే చేసేవారు. మందులు పంపిణీ చేశారు. ఆ 2023లో పీహెచ్‌సీ డాక్టర్ ఒక్కో రోజు ఒక్కో గ్రామానికి వెళ్లి ఓపీ సేవలందించారు. 2023లో 8.90 లక్షల మందికి ఓపీ సేవలందించారు. వీరిలో 89 వేల మంది వరకు మంచం మీద ఉన్న రోగులు, వృద్ధులున్నారు. ఇందులో 23 వేల మంది వరకు గర్భిణులు, బాలింతలున్నారు. కూటమి అధికారంలోకి రాక ముందు వరకు 2024లో 8.57 లక్షల మందికి ఇంటి వద్దనే ఓపీ సేవలందించారు. 75 వేల మంది వృద్ధులను, మంచానికి పరిమితమైన వారికి సేవలు అందించారు. కూటమి అధికారంలోకి వచ్చాక 2025లో దాదాపు ఐదు నెలలుగా ఇంటివద్దకు వెళ్లి సేవలు అందించే డాక్టర్లు కనుమరుగయ్యారు.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

ప్రతిష్టాత్మకంగా జగనన్న సురక్ష



జగనన్న సురక్షలో సర్టిఫికెట్లు అందుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

నెల్లూరు (పొగతోట): వైఎస్సార్‌సీపీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో భాగంగా 769 సచివాలయాల పరిధిలో ప్రజలకు అవసరమైన 5,77,374 ధ్రువీకరణ పత్రాలను ఉచితంగా అందజేశారు. సచివాలయ వ్యవస్థ ద్వారా అందుతున్న సేవలను ప్రతి గడపకు తీసుకెళ్లడంతోపాటు సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి అందాలనే లక్ష్యంతో 2023 జూన్ 24 నుంచి జూలై 31వ తేదీ వరకు 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని 769 సచివాలయాలు, 13,744 క్లస్టర్ల పరిధిలోని వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, మండల అధికారులు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవసరమైన 5,85,323 సర్వీసులను నమోదు చేసుకుని, 5,77,374 సేవలను అందించారు. సరైన ఆధారాలు లేనందున 6,415 సర్వీసులను తిరస్కరించారు. జిల్లాలోని మొత్తం 8,37,465 కుటుంబాలకు గాను 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో 7,31,108 కుటుంబాలకు సేవలు అందించారు. ఉచిత సేవల వల్ల సుమారు రూ.2.97 కోట్ల ఆర్థికపరమైన ప్రయోజనం కల్పించింది.

వలంటీర్లకు ఉద్వాసనతో..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వలంటీర్ల వ్యవస్థకు ఉద్వాసన పలికింది. జిల్లాలో 25 లక్షలకు పైగా జనాభాఎ సుమారు 15,417 మంది వలంటీర్లను జగన్ ప్రభుత్వం నియమించింది. ప్రజలకు ఇంటి వద్దకే సేవలు అందించింది. రేషన్ కార్డులు, పింఛన్లు, ఫ్యామిలీ సర్టిఫికెట్లు, క్యాస్ట్, ఇన్‌కమ్, నెటివిటీ, ఆదాయం తదితర సర్టిఫికెట్లు ఎవరికి అవసరమైనా ఇంటి వద్దనే పొందారు.

ఇప్పుడు సర్టిఫికెట్ పేరుతో దోపిడీ

కోటమిట్టకు చెందిన మస్తాన్‌బీ తల్లిదండ్రులు ఇద్దరు మరణించారు. భర్త కూడా మరణించాడు. ఇద్దరు పిల్లలతో ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ కోసం ఏడు నెలల నుంచి సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. తల్లికున్న ఆస్తిని మార్చుకునేందుకు ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ అవసరం కావడంతో నిత్యం సర్టిఫికెట్ కోసం పోరాటం చేస్తున్నారు. సర్టిఫికెట్ ఇప్పిస్తామంటూ మూడో వ్యక్తులు డబ్బులు దండుకుంటున్నారే కానీ ఇంత వరకు మంజూరు చేయలేదంటూ మస్తాన్‌బీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కుట్రలపై న్యాయమే గెలుస్తుంది

- న్యాయస్థానాలపై నమ్మకం ఉంది
- వైఎస్సార్‌సీపీ క్యాడర్ అధైర్యపడొద్దు
- కాకాణి పూజిత



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి కాకాణి కుమార్తె పూజిత

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): 'ఎవరెన్ని కుట్రలు చేసి తప్పుడు కేసులు పెట్టినా.. చివరకు న్యాయమే గెలుస్తుంది. న్యాయస్థానాలపై నమ్మకం ఉంది. వైఎస్సార్‌సీపీ కేడర్ ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదు. మేమంతా అండగా ఉంటాం.' అని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుమార్తె కాకాణి పూజిత అన్నారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మా నాన్నపై తప్పుడు కేసులు పెట్టించి జైలుపాల్జేశారని, దీనికి ఎవరూ అధైర్య పడొద్దన్నారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో నా తండ్రి గోవర్ధన్‌రెడ్డి ప్రజల అభిమానాన్ని సంపాదించుకున్నారన్నారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ అండగా నిలబడాలనే తాపత్రయం ఉన్న వ్యక్తిపై అక్రమ కేసులు బనాయించడం బాధాకరమన్నారు. కరోనా వంటి ప్రాణాపాయ స్థితిలో కూడా ప్రాణాలకు సైతం లెక్క చేయకుండా తనను నమ్ముకున్న ప్రజల ఇబ్బందులను తీర్చిన వ్యక్తి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అని చెప్పారు. జిల్లా పరిషత్ చైర్మన్‌గా, ఎమ్మెల్యేగా, మంత్రిగా ఏ పదవి చేపట్టినా ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతోనే నిత్యం పని చేశారన్నారు. రాజకీయాల్లో ప్రత్యర్థులుగా భావించాలే తప్పా ఎవరిని శత్రువులుగా చూడొద్దని తమకు ఉన్నత విలువలు నేర్పిన వ్యక్తి నా తండ్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అని తెలిపారు. నాన్న ఎటువంటి తప్పు చేయలేదని ప్రజలందరూ ధృడంగా నమ్ముతున్నారన్నారు. ఇటువంటి కష్టకాలంలో మా గురించి, నాన్న గురించి తెలుసుకుంటూ నేనున్నానంటూ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇవ్వడం ధైర్యానిచ్చిందన్నారు. నాన్నపై కేసులు పెట్టి భయపెట్టాలని చూసినా లెక్క చేయకుండా ప్రజాగళాన్ని తన గళంగా వినిపించారన్నారు. న్యాయస్థానాలపై నమ్మకం ఉందని, కచ్చితంగా నాన్న జైలు నుంచి తిరిగి వచ్చి మరింత ఉత్సాహంతో ప్రజల కోసం పోరాటం చేస్తారన్నారు. అక్రమ అరెస్ట్ కాకుండా ఉండేందుకే నాన్న న్యాయ స్థానాలను ఆశ్రయించారని, బెయిల్ పిటిషన్ ఇంకా కొట్టి వేయలేదని, హైకోర్టులో విచారణ కొనసాగుతుందన్నారు. సోషల్ మీడియా లో తన తండ్రిపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని, వాస్తవాలు ఎప్పటికైనా వెలుగులోకి వస్తాయన్నారు. సర్వేపల్లి ప్రజలు ఎవరూ అధైర్య పడొద్దని, అసహనానికి గురికావొద్దన్నారు. సంయమనం పాటించాలని కోరారు. కేసులు, జైళ్లు తాత్కాలికమని, అందరి ఆశీస్సులతో తన తండ్రి నిర్దోషిగా తిరిగి వస్తారని వివరించారు.

క్లుప్తంగా

మా పొట్ట కొట్టొద్దు



మాట్లాడుతున్న ఇసుక రీచ్ కూలీలు

ఆత్మకూరు: ఇసుక రీచ్‌లో జేసీబీ, హిటాచీలను కూలీలు అడ్డుకున్నారు. ఆత్మకూరు మండలంలోని అప్పారావుపాళెం రీచ్ నుంచి ఇసుక తరలించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి తెచ్చుకున్నామని టీడీపీ నేతలు చెబుతున్నారు. కాగా జేసీబీ, హిటాచీలతో టిప్పర్లకు లోడ్ చేసి పంపుతామని గురువారం రీచ్ వద్దకు రావడంతో కూలీలు అడ్డుకున్నారు. నేతలు దబాయించడంతో నేరుగా వారంతా ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డీఓ బి.పావనికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సుమారు 40 దళిత కుటుంబాల వారం ట్రాక్టర్లలో ఇసుక లోడ్ చేసి వచ్చే డబ్బులతో కుటుంబాలను పోషించుకుంటున్నామని చెప్పారు. కొందరు టీడీపీకి చెందిన మద్దతుదారులు టిప్పర్లు, జేసీబీతో రీచ్ వద్దకు వచ్చి ఇక నుంచి ఇసుక లోడింగ్ యంత్రాలతో చేయనున్నట్లు చెప్పడంతో అడ్డుకున్నామని తెలిపారు. నేతల్ని అడిగితే దిక్కున్న చోట చెప్పుకోవాలని దబాయించడంతో ఆర్డీఓ కార్యాలయానికి వచ్చామన్నారు. తమను రోడ్డున పడేయొద్దని వేడుకున్నారు. స్పందించిన ఆర్డీఓ పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారన్నారు.

అధునాతన వైద్యం చేసి ప్రాణాలు కాపాడాం



మాట్లాడుతున్న విజయకుమార్

నెల్లూరు(అర్బన్): కోమాలో ఉన్న ఓ వ్యక్తికి అధునాతన వైద్యసేవలందించి ప్రాణాలు కాపాడామని మెడికవర్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి సీనియర్ ఫిజీషియన్ డాక్టర్ పి.విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం ఆస్పత్రిలో వివరాలు వెల్లడించారు. సూళ్లూరుపేటకు చెందిన యువకుడు ఈనెల 22న రాత్రి ప్రమాదకరమైన యాంటీ సైకోటిక్ మాత్రలను పెద్ద మొత్తంలో మింగడంతో కోమాలోకి వెళ్లిపోయాడన్నారు. 23వ తేదీ తెల్లవారుజామున గమనించిన కుటుంబ సభ్యులు స్థానికంగా ఉండే ఆస్పత్రిలో ప్రథమ చికిత్స చేయించి డాక్టర్ల సూచన మేరకు మెడికవర్‌కు తీసుకొచ్చారన్నారు. తక్షణమే ఐసీయూలో చేర్చి దశలవారీగా చికిత్స అందించామన్నారు. హార్ట్ బీట్‌ను, కిడ్నీ పనితీరును, బీపీని సాధారణ స్థితికి తెచ్చి రోగిని బతికించామన్నారు.

ప్రజాభిప్రాయం మేరకే మైనింగ్‌కు అనుమతి

సైదాపురం: ప్రజల అభిప్రాయాల మేరకే మైనింగ్ లీజుకు అనుమతి మంజూరు చేస్తున్నట్లు నెల్లూరు ఆర్డీఓ నాగ సంతోషి అనూష వెల్లడించారు. మండలంలోని గోకుల బృందావనం గ్రామ సమీపంలో గురువారం ధ్వని ప్రమోటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో పర్యావరణంపై ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మొలకలపూండ్లలోని 804 - పీ, 806 - పీ2లో 32.758 హెక్టార్లలో మైనింగ్ కార్యకలాపాలను నిర్వహించేందుకు పర్యావరణ అనుమతి కోసం ప్రజాభిప్రాయ సేకరణను నిర్వహిస్తున్నట్లు ఆమె చెప్పారు. మైనింగ్‌తో ఇబ్బందులు ఉండవని గ్రామస్తులు స్పష్టం చేశారు. పర్యావరణ అధికారి అశోక్‌కుమార్, గని యజమాని షేక్ జాఫర్, తహసీల్దార్ రమాదేవి, సర్పంచ్ శారద, గ్రామ ఉపసర్పంచ్ శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యంగా దిద్దారు!




- తక్కువ వ్యవధిలో పది ఫలితాలు విడుదల చేయాలని ప్రభుత్వం హడావుడి
- ఇష్టారాజ్యంగా పది జవాబుపత్రాల మూల్యాంకనం
- విద్యార్థుల మార్కుల నమోదులో నిర్లక్ష్యం
- రీవాల్యుయేషన్, రీకౌంటింగ్‌కు పలువురి దరఖాస్తు
- పెరిగిన మార్కులు, పాసైనట్లు ప్రకటన
- అవగాహన లేమి, డబ్బుల్లేక మరికొందరు విద్యార్థుల ఇక్కట్లు
- రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖపై తల్లిదండ్రుల ఆగ్రహం

కోవూరు మండలం వేగూరు గ్రామానికి చెందిన రామిశెట్టి సాయికుందన స్థానిక వశిష్ట స్కూల్లో పదో తరగతి చదివింది. ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో 34 మార్కులొచ్చాయి. బాగా చదివే సాయికుందనకు ఫస్ట్ లాంగ్వేజ్‌లో 94, సెకండ్ లాంగ్వేజ్‌లో 79, మ్యాథ్స్‌లో 96, సైన్స్‌లో 92, సోషల్లో 94 మార్కులొచ్చాయి. ఈ నేపథ్యంలో రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసింది. ఇంగ్లిష్‌లో 93 మార్కులొచ్చినట్లు అధికారులు ప్రకటించారు. ఈ రీతిలో పదో తరగతిలో ఫెయిలైన పలువురు విద్యార్థులకు రీవాల్యుయేషన్, రీకౌంటింగ్‌లో మార్కులు పెరిగాయి.

	SUBJECT	Marks	Result
1	FIRST LANGUAGE	94	P
2	SECOND LANGUAGE	79	P
3	THIRD LANGUAGE	34	F
4	MATHEMATICS	96	P
5	SCIENCE	92	P
6	SOCIAL STUDIES	94	P

తొలుత 34 మార్కులే వచ్చాయి



BOARD OF SECONDARY EDUCATION
ANDHRA PRADESH
SSC PUBLIC EXAMINATIONS, MARCH 2025
REVERIFICATION / RECOUNTING OF MARKS

Roll Number: 2518114071
Subject: 13E_R - English

There is "Change" in your marks from 34 to 93

రీవాల్యుయేషన్ జరిగాక పెరిగిన మార్కులు

జి.మోక్షిత అనే విద్యార్థి చదువులో ముందుంటుంది. కానీ సోషల్ సబ్జెక్ట్‌లో 21 మార్కులొచ్చాయి. దీంతో రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేసింది. అందులో 84 మార్కులొచ్చాయి. ఈ విషయంపై పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో మూల్యాంకనంలో అసిస్టెంట్ ఎగ్జామినర్‌గా విధులు నిర్వహించిన స్కూల్ అసిస్టెంట్ శాంతి, స్పెషల్ అసిస్టెంట్‌గా వ్యవహరించిన వి.సురేష్‌ను డీఈఓ బాలాజీరావు విధుల నుంచి సస్పెండ్ చేశారు.

నెల్లూరు(టౌన్): పదో తరగతి విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం, కొందరు ఉపాధ్యాయులు చెలగాటమాడారు. జవాబుపత్రాల మూల్యాంకనంలో నిర్లక్ష్యం కారణంగా అనేకమంది ఇబ్బందులు పడ్డారు. ఇష్టారాజ్యంగా పేపర్లు దిద్ది బాగా చదివే పిల్లల్ని ఫెయిల్ చేశారు. రీవాల్యుయేషన్, రీవెరిఫికేషన్ వల్ల జరిగిన తప్పిదాలు బయటపడ్డాయి. జిల్లాలో 600కు పైగా ప్రభుత్వ, ప్రైవేట్ ఉన్నత పాఠశాలలున్నాయి. వాటి నుంచి ఈ ఏడాది పది పరీక్షలకు 28,275 మంది విద్యార్థులు హాజరయ్యారు. గతనెల 3వ తేదీ నుంచి జవాబుపత్రాల మూల్యాంకనం జరిగింది. 1,036 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 174 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 348 మంది స్పెషల్ ఆఫీసర్లు విధులు నిర్వహించారు. అయితే కొందరు ఉపాధ్యాయులు మూల్యాంకనానికి ఆసక్తి చూపలేదు. ఒక్కొక్కరు 40 జవాబుపత్రాలు దిద్దాల్సి ఉంటుంది. వాటిని చీఫ్ ఎగ్జామినర్ పరిశీలిస్తారు. అనంతరం స్పెషల్ ఆఫీసర్ మళ్లీ ఒకసారి చెక్ చేస్తారు. ఈ రీతిలో జవాబుపత్రాలను ముగ్గురు ఉపాధ్యాయులు పరిశీలిస్తారు. ఒక్కో పేపర్‌కు రూ.10లు మాత్రమే ఇస్తారు.



పర్యవేక్షణ లేక..

జవాబుపత్రాలను బాధ్యతాయుతంగా దిద్దాల్సి ఉంటుంది. అయితే కొందరు నిర్లక్ష్యంగా వ్యవహరించారనే విమర్శలున్నాయి. మూల్యాంకన కేంద్రంలో సెల్‌ఫోన్ వినియోగించడం నిషేధం. అయితే పలువురు ఫోన్ తీసుకెళ్లి మాట్లాడుతూ ఉంటారు. విడివిడిగా కూర్చొని మూల్యాంకనం చేయకుండా గుంపుగా కూర్చొని కబుర్లు చెప్పుకొంటూ దిద్దుతున్న పరిస్థితి నెలకొంది. అదే విధంగా దూర ప్రాంతాల నుంచి వచ్చిన టీచర్లు త్వరగా దిద్ది ఇంటికి వెళ్లిపోవాలన్న ఆలోచనలో ఉంటారు. అక్కడ పర్యవేక్షణ కూడా నామమాత్రంగానే ఉంటుంది. ఎంఈఓలు, డిప్యూటీ డీఈఓలు, డీఈఓతోపాటు రాష్ట్ర పరిశీలకుడిగా వచ్చిన అధికారి సైతం మొక్కుబడిగా పర్యవేక్షిస్తారన్న విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలోనే జవాబుపత్రాల మూల్యాంకనంలో తరచూ తప్పులు జరుగుతుంటాయని విద్యాశాఖాధికారులతోపాటు ఉపాధ్యాయులు చెబుతుండటం గమనార్హం. ఒక్కో జవాబుపత్రాన్ని ముగ్గురు పరిశీలించినప్పుడు తప్పులు ఎందుకు జరుగుతాయని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. కొందరు బాధ్యత లేకుండా మూల్యాంకనం చేసినప్పుడే ఇలాంటి జరుగుతుంటాయని మండిపడుతున్నారు.

బాధ్యులెవరు?

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం, మూల్యాంకనంలో పలువురు ఉపాధ్యాయులు చేసిన తప్పిదాలకు విద్యార్థులు బలవుతున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పది ఫలితాలను తక్కువ సమయంలో విడుదల చేయాలని ప్రభుత్వం ఆలోచన చేసింది. ఈ నేపథ్యంలో ఒత్తిడితోనే ఇలాంటివి జరుగుతున్నాయని మేధావులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పరీక్షల్లో ఫెయిలయ్యామన్న బాధతో క్షణికావేశంతో కొంతమంది విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడుతున్న ఘటనలు ఎన్నో ఉన్నాయి. చాలాచోట్ల ఫెయిలైన పిల్లలను చదువు మాన్పించేస్తున్న పరిస్థితి ఉంది. కొంతమంది మాత్రమే రీవాల్యుయేషన్, రీకౌంటింగ్‌కు పోతున్నారు. ఆర్థికంగా స్థోమత లేనివారు దరఖాస్తు చేసుకోలేకపోతున్నారు. పదిలో ఉత్తమ ఫలితాలు సాధించినా అధికారులు తప్పిదాల కారణంగా ట్రిపుల్ ఐటీ, ఏపీఆర్‌జేసీ, పాలిటెక్నిక్ తదితర కోర్సుల్లో అవకాశాన్ని కోల్పోతున్నారు. ఇప్పటికే ఈ కోర్సులకు సంబంధించి దరఖాస్తుల గడువు కూడా ముగిసింది. కొందరి తప్పిదాలకు ఎవరు బాధ్యత వహిస్తారనే ప్రశ్నలు తల్లిదండ్రుల నుంచి వస్తున్నాయి.

తప్పిదాలు చేస్తే చర్యలు



పది మూల్యాంకనంలో తప్పిదాలు జరిగితే అక్కడ విధులు నిర్వహించిన చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్పెషల్ ఆఫీసర్లపై తప్పకుండా చర్యలు తీసుకుంటారు. వారిని విధుల నుంచి తొలగిస్తాం. మూల్యాంకన సమయంలో చాలా అప్రమత్తంగా ఉండాలి. అందరూ సీనియర్లనే తీసుకున్నాం. భవిష్యత్‌లో ఇలాంటివి జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం.

– బాలాజీరావు, డీఈఓ

ఆర్టీసీ.. తెలుగుదేశం సేవలో..



వెలవెలబోతున్న బస్టాండ్

- మహానాడుకు జిల్లా నుంచి 263 బస్సులు
- వేసవి సెలవుల నేపథ్యంలో ప్రజలకు ఇబ్బందులు

నెల్లూరు సిటీ: కడపలో జరిగిన మహానాడు కార్యక్రమానికి 263 ఆర్టీసీ బస్సులను కేటాయించడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వేసవి సెలవులు కావడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లేవారు, వచ్చేవారు బస్సులు అందుబాటులో లేక పడిగాపులు కాయాల్సి వచ్చింది. జిల్లా నుంచి మొత్తం 263 ఆర్టీసీ బస్సులను అధికారులు తెలుగుదేశం మహానాడుకు కేటాయించారు. నెల్లూరు డిపో-1 నుంచి 45, డిపో-2 నుంచి 51, ఆత్మకూరు నుంచి 50, కావలి నుంచి 25, ఉదయగిరి నుంచి 50, కందుకూరు నుంచి 17, రాపూరు నుంచి 25 బస్సులు వెళ్లాయి.

ప్రయాణికుల ఎదురుచూపులు

నెల్లూరులోని డిపో-1, డిపో-2ల నుంచి నిత్యం అనేకమంది బస్సుల్లో రాకపోకలు సాగిస్తుంటారు. గురువారం ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేసవి సెలవుల నేపథ్యంలో వేల సంఖ్యలో ప్రయాణికులు ఊర్లకు వెళ్లేందుకు బస్టాండ్‌లకు వచ్చారు. అయితే గంటల తరబడి వేచి చూసినా బస్సులు రాకపోవడంతో కొందరు వెనుతిరిగారు. మరికొందరు అధికంగా ఖర్చు చేసి ప్రైవేట్ బస్సులు, ఇతర వాహనాల్లో గమ్యస్థానాలకు బయలుదేరారు. పార్టీ కార్యక్రమానికి పెద్ద ఎత్తున బస్సులు తరలించడంపై జనం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కండలేరులో 41.001 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 41.001 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. జలాశయం నుంచి సత్యసాయి గంగ కాలువకు 1,860, పిన్నేరు కాలువకు 10, లోలెవల్ కాలువకు 60, హైలెవల్ కాలువకు 20, మొదటి బ్రాంచ్ కాలువకు 85 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఆరుగురికి గాయాలు

వివిధ మండలాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఆరుగురు వ్యక్తులు గాయపడ్డారు. వివరాలిలా ఉన్నాయి.



తీవ్రంగా గాయపడిన ఖాదర్‌బాషా

సంగం: చెట్టును ఆటో ఢీకొన్న ఘటనలో డ్రైవర్‌కు తీవ్రంగా గాయపడిన ఘటన సంగం – కలిగిరి రహదారిలో గురువారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. ఏఎస్‌పేటకు చెందిన ఖాదర్‌బాషా అనే డ్రైవర్ తన ఆటోలో ఇద్దరు యువకులను ఎక్కించుకుని సంగం బయలుదేరాడు. సంగంకు కూతవేటు దూరంలో కలిగిరి రహదారిలో ముందు వెళ్తున్న వాహనాన్ని ఓవర్‌టేక్ చేయబోయి చెట్టును ఢీకొట్టాడు. దీంతో హ్యాండిల్ విరిగి అతడి ఎడమ తోడలోకి చొచ్చుకుపోయింది. యువకులు అటుగా వెళ్తున్న వాహనదారులను ఆపి ఖాదర్‌బాషాను బయటకు తీశారు. 108 అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ రహదారిపై..



గాయపడిన చిన్నయ్య

మర్రిపాడు: మండలంలో గురువారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఐదుగురు వ్యక్తులు గాయపడ్డారు. వివరాలు.. నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై నందవరం కూడలి వద్ద బస్సును కడప నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. దీంతో కారులో ఉన్న ఇద్దరు చిన్నారులతోపాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించారు. అదే హైవేపై గంగుంట వద్ద లారీని బైక్ ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అతడిని ఇస్కపల్లికి చెందిన చిన్నయ్యగా గుర్తించారు. ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతున్నారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి : రూ.40
సన్నవి : రూ.20
పండ్లు : రూ.10

గుంతల దారులు.. భయంగా రాకపోకలు

- ప్రమాదకరంగా వెంకటగిరి నియోజకవర్గంలోని రోడ్లు
- మరమ్మతులు ఎప్పుడు చేస్తారో..
- నిధులు మంజూరు కాలేదంటూ పనుల నిలిపివేత
- వర్షాలకు అధ్వానంగా మారిన రహదారులు

అధికారంలోకి రాగానే రోడ్లను అద్దంలా మారుస్తామని కూటమి నేతలు ఎన్నికల సమయంలో ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చాక కొత్త రోడ్ల నిర్మాణం సంగతి దేవుడెరుగు ఉన్న వాటిలో గుంతలను పూడ్చకుండా గాలికొదిలేశారు. ప్రకృతి వనరులను దోచుకోవడంపై పెట్టిన శ్రద్ధ ప్రజలకు ఉపయోగపడే పనులపై పెట్టడం లేదు.





దారుణంగా ఉన్న సైదాపురం - పాదలకూరు రోడ్డు

సైదాపురం: సైదాపురం – పొదలకూరు రోడ్డు ఆధునికీకరణ పనులకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రూ.43 కోట్ల నిధులను మంజూరు చేసింది. 24 కిలోమీటర్ల పొడవైన ఈ రహదారి పనులు ఇప్పటికి 20 శాతం పైగానే పూర్తి చేశారు. దీని వెంబడి ఉన్న సైదాపురం, ఊటుకూరు, తురిమెర్ల, కలిచేడు గ్రామాల్లో సిమెంట్ రోడ్డు నిర్మాణంతోపాటు మూడు కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు పనులను చేశారు. అయితే మూడు నెలల నుంచి వాటిని పూర్తిగా నిలిపివేశారు. అప్పటి నుంచి రహదారి మరింత దారుణంగా మారింది. వంతెనల వద్ద ప్రమాదకర పరిస్థితులున్నాయి. మూడు నెలల నుంచి తట్ట మట్టి కూడా పోయలేదు. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు అడుగుకోగుంత ఏర్పడటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గుంతల్లో వాహనాలు పడి పలువురు వాహనదారులు గాయపడ్డారు.

పట్టించుకోకుండా..

రోడ్డు పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో రహదారి యథాస్థితికి చేరుకునే పరిస్థితికి వచ్చింది. ఇంత జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ రహదారిలో దాడిశెట్టిపల్లి, మొలకలపూండ్ల, పొక్కందల, ఆదూరుపల్లి, పెరుమాళ్లపాడు, జోగిపల్లి, గిద్దలూరు, పరసారెడ్డిపల్లి, గోవిందపల్లి, తురిమెర్ల, కట్టుబడిపల్లి, దేవరవేమూరు, తలుపూరు, చేర్లోపల్లి, ఓరుపల్లి, మలిచేడు గ్రామాలున్నాయి. దీని గుండా పొదలకూరు మీదుగా నెల్లూరుకు చేరుకుంటారు. వెంకటగిరి – నెల్లూరు వెళ్లే రహదారి దారుణంగా మారింది. బాలాయపల్లి నుంచి అమ్మపాళెం వరకు రహదారి అధ్వానంగా ఉండటంతో తిరుపతి – నెల్లూరు జిల్లాలను కలిపే ఈ రహదారిపై ప్రయాణం నరకంగా మారింది. సైదాపురం – పొదలకూరు, వెంకటగిరి – నెల్లూరుతోపాటు పలు రహదారులు ఇప్పటికే గుంతలమయంగా మారాయి. వర్షాలకు గుంతలు పెద్దవిగా మారే పరిస్థితి ఉంది. ఇప్పటికే ఈ రోడ్లపై 10 కిలోమీటర్ల ప్రయాణానికి అధిక సమయం పడుతోంది. ఎన్నికల సమయంలో ఎన్నో మాటలు చెప్పిన ఓట్లు వేయించుకున్న కూటమి నేతలు ప్రకృతి వనరులను దోచుకోవడంలో బిజీ అయిపోయారు. రోడ్ల మరమ్మతులపై ఏ మాత్రం శ్రద్ధ పెట్టడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అర్ధాంతరంగా ఆగిన సైదాపురం – పొదలకూరు రహదారిని బాగు చేయాలని కోరుతున్నారు.

హామీలు నెరవేర్చాలి



సైదాపురం – పొదలకూరు రోడ్డు అధ్వానంగా మారి రాకపోకలకు ఇబ్బంది ఉంది. రోడ్డు ప్రమాదాలతో పలువురు గాయపడుతున్నారు. నియోజకవర్గంలోని వెంకటగిరి – బాలాయపల్లి వరకు రహదారి దారుణంగా మారింది. వెంటనే కూటమి ప్రభుత్వం స్పందించి మరమ్మతులు చేయించాలి. అర్ధాంతరంగా ఆపేసిన సైదాపురం – పొదలకూరు రోడ్డుకు మరమ్మతులు పూర్తి చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి.

– నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త

తండ్రి హత్య కేసులో కుమారుడికి జీవిత ఖైదు

నెల్లూరు(లీగల్): మద్యం తాగేందుకు డబ్బులివ్వలేదని కక్షతో తండ్రిని హత్య చేశాడని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు షేక్ తాజుద్దీన్‌కు జీవిత ఖైదుతోపాటు, రూ.10,000 జరిమానా విధిస్తూ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి జి.శ్రీనివాస్ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. నెల్లూరు వేదాయపాళెం పోలీస్‌స్టేషన్ పరిధిలోని బుజబుజనెల్లూరు చెన్నకేశవ నగర్ ప్రాంతంలో షేక్ మస్తాన్ రియల్ ఎస్టేట్, కత్తులు సానపట్టే పనిచేస్తూ కుటుంబంతో ఉండేవాడు. కుమారుడు తాజుద్దీన్ ఆటో నడిపేవాడు. అతను చెడు వ్యసనాలకు బానిసై ఆస్తి కోసం తండ్రితో గొడవ పడుతుండేవాడు. మస్తాన్‌కు ఆరోగ్య సమస్యలు రావడంతో ఇంట్లో ఉండేవాడు. నిందితుడు డబ్బుల కోసం ఇంట్లో ఉన్న వారితో గొడవలు పడేవాడు. అతని వేధింపులు తాళలేక భార్య పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లింది. 2021 జూన్ 4వ తేదీన మద్యం తాగిన తాజుద్దీన్ మత్తులో ఇంట్లో ఉన్న మస్తాన్‌పై కత్తితో దాడి చేసి హత్య చేశాడు. మృతుడి మేనల్లుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం తాజుద్దీన్‌పై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసు విచారణలో నేరం రుజువు కావడంతో పైమేరకు శిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ఇన్‌చార్జి ఏపీపీ సుందరయ్య యాదవ్ కేసు వాదించారు.